క్లుప్తంగా

రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు

రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గంలోని పొతంగల్ మండలానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కూల్‌ను పోతంగల్ మండలం పీఎస్ఆర్‌నగర్(సోంపూర్ శివారులో) నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రానికి చెందిన కాచర్ల నవ్య కుటుంబ సభ్యులకు మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్ రూ.22,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఆలూర్‌కు చెందిన కాచర్ల నవ్య అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆస్పత్రి వ్యయాలను కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రికవరీ సెల్‌ఫోన్ల అందజేత



బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల పోగొట్టుకున్న 9 సెల్‌ఫోన్‌లను సీఐ వెంకట నారాయణ యజమానులకు మంగళవారం అందజేశారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి సెల్ ఫోన్ యజమానులకు అందించామని సీఐ తెలిపారు.

నిధులు మంజూరు చేయాలి



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని జీపీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. నందిపేటలో జీపీ భవనం ఇరుకుగా ఉండటంతో పాలనకు ఇబ్బందిగా మారిందని, నూతన భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయాలని కోరారు. నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు మంద మహిపాల్ తెలిపారు.

నిబంధనలు పాటించాలి



రెంజల్(బోధన్): బక్రీద్ సందర్భంగా వ్యాపారులు పశువులను వాహనాల్లో తరలించే సమయంలో నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. సాటాపూర్‌లో మంగళవారం రెవెన్యూ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో వ్యాపారులు, మతపెద్దలు, పంచాయతీ కార్యదర్శులతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై చంద్రమోహన్ మాట్లాడుతూ..పశువులను పరిమితికి మించి వాహనాల్లో తరలించవద్దన్నారు. పశువులను కొన్న వ్యాపారులు తప్పనిసరిగా పంచాయతీ కార్యాలయం నుండి రసీదు తీసుకోవాలన్నారు.

ఇప్పటికీ పాత అధికారుల పేర్లే



పీహెచ్‌సీలో బోర్డులపై పాత అధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లు

డొంకేశ్వర్(ఆర్మూర్): స్థానిక పీహెచ్‌సీలో ప్రజలకు ఉపయోగపడే సమాచార బోర్డులను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. డివిజన్, మండల అధికారులతో పాటు మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది మారి ఏళ్లు గడుస్తున్నా ఇంకా వారి పేర్లు, ఫోన్ నంబర్లు కనిపిస్తున్నాయి. పీహెచ్‌సీ సలహా సంఘం సభ్యులుగా మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని ఎమ్మెల్యేగా, ఎంపీపీ, జెడ్పీటీసీలు కూడా పాతవారినే కొనసాగిస్తూ బోర్డుపై ఉంచారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన సమాచార హక్కు చట్టం బోర్డు మీద కూడా అప్పిలేట్ అధికారి పేరు సైతం పాతదే ఉండడం అక్కడి సిబ్బంది పనితీరుకు నిదర్శనమని చెప్పొచ్చు.

పడకేసిన పారిశుధ్యం..!

- మురికి కాలువలు పూడికమయం
- వర్షాకాలం సమీపిస్తున్నా పట్టించుకోని అధికారులు
- పల్లెల్లో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- కనిపించని ప్రత్యేక పాలన



బాల్కొండ మండల కేంద్రంలో..



మెండోరా మండల కేంద్రంలో మురికి కాలువలో నిలిచిన మురుగు

బాల్కొండ: పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. మెండోరా, బాల్కొండ మండల కేంద్రాల్లో మురికి కాలువలు పూడికతో నిండిపోవడంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు కూడా మురికి కాలువల్లో ప్రవహించలేనంతగా కాలువల్లో చెత్త పేరుకుపోయింది. దీంతో ఇళ్లలోకి వర్షపు నీటితో పాటు మురికి నీరు వచ్చి చేరుతుంది. మురుగు నీరు నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది.

సీజనల్ వ్యాధుల ప్రభావం..

పల్లెల్లో పారిశుధ్యం పడకేయడం వల్ల వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశముంది. వర్షాలు ముందస్తుగా కురవడం వల్ల రెండు రోజుల నుంచి పల్లెల్లో జ్వరాలు ప్రారంభమయ్యాయి. దానికి తోడు దేశంలో కరోనా కేసులు పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పల్లెల్లో గతేడాది ఫిబ్రవరిలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలన తీసుకొచ్చింది. కాని పల్లెల్లో ప్రత్యేక పాలన కనిపించడం లేదు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు వారం రోజులకు ఒక సారి కూడా గ్రామాల్లో కనిపించడం లేదు. దీంతో కింది స్థాయి సిబ్బంది చెప్పిందే మాట.. చేసిందే పని అన్నట్లుగా సాగుతుంది. ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడం కూడా పల్లెలకు శాపమైంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పల్లె ప్రజలు వేడుకుంటున్నారు.

చర్యలు చేపడతాం..

పల్లెల్లో మురికి కాలువల్లో పిచ్చి మొక్కలు, చెత్త, పూడిక తొలిగించటానికి చర్యలు తీసుకోవాలని జీపీ కార్యదర్శులకు ఇది వరకు సూచించాం. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

– వనజ, ఎంపీడీవో, మెండోరా

యోగాసనాలతో మానసిక, శారీరక ఆరోగ్యం



యోగాసనాల గురించి వివరిస్తున్న ఇన్‌స్ట్రక్టర్

రుద్రూర్: యోగాసనాలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని యోగా ఇన్‌స్ట్రక్టర్లు సతీష్ గౌడ్, ఇందూర్ జ్యోతి అన్నారు. అంతర్జాతీయ యోగా డే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పొతంగల్ జీపీలో యోగా ప్రాముఖ్యత, ప్రాణాయామం, యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. యోగా.. జీర్ణ వ్యవస్థ, రక్త ప్రసరణలను మెరుగుపరుస్తుందన్నారు. తెలంగాణ ఆయుష్ విభాగం సూచనల మేరకు వచ్చే నెల 23 వరకు యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రతి రోజూ ఒక ప్రాంతంలో పీహెచ్‌సీ ఆయుష్ వైద్యాధికారి రాధిక ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు వివరించారు. జీపీ కార్యదర్శి చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లను మంజూరు చేయాలి

నవీపేట: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం మండల నాయకులు నాయక్‌వాడీ శ్రీనివాస్.. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. అనువైన ఖాళీ స్థలాన్ని ఎంపిక చేసి ఇళ్లు లేని నిరుపేదలకు కేటాయించాలని కోరారు.

సమాచారం..

'కశ్మీర్ చరిత్ర వక్రీకరణలు - వాస్తవాలు'పై బోధన్‌లో నేడు సదస్సు

బోధన్: ఇతిహాస సంకలన సమితి బోధన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు 'కశ్మీర్ చరిత్ర వక్రీకరణలు- వాస్తవాలు' అనే అంశంపై ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులు, సీనియర్ పాత్రికేయులు రాక సుధాకర్ ఉపన్యాస కార్యక్రమం నిర్వహించనున్నారు. కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి ఘటన అనంతరం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో అక్కడ ప్రస్తుత పరిస్థితులు, కశ్మీర్ వాస్తవ చరిత్ర అంశాలను ఆయన వివరిస్తారని నిర్వాహకులు తెలిపారు.

యూరియా వినియోగం తగ్గించాలి



మెండోరాలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త మంజు భార్గవి

మోర్తాడ్: పంటల సాగులో యూరియా వినియోగం తగ్గిస్తేనే మేలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మంజు భార్గవి చెప్పారు. రసాయనాల వాడకం తగ్గించడం వల్ల పెట్టుబడి తగ్గిపోవడంతో పాటు భూసారానికి నష్టం జరుగదని, నాణ్యమైన పంటలు చేతికి అందుతాయని తెలిపారు. మంగళవారం భీమ్‌గల్ మండలం మెండోరాలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఏవో లావణ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

రుద్రూర్: రసాయన మందులను విచక్షణారహితంగా పిచికారీ చేయకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవేత్త ఎం. సాయి చరణ్ సూచించారు. పొతంగల్ మండలం కల్లూర్‌లో మంగళవారం ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల సందేహాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. అధిక దిగుబడులు సాధించడానికి సలహాలు, సూచనలిచ్చారు. ఏవో నిశిత మాట్లాడుతూ.. తప్పనిసరిగా వేసవి దుక్కులు దున్నుకోవాలని సూచించారు. లైవ్ స్టాక్ ఆఫీసర్ నారాయణ, ఏఈవో సుప్రియ, మాజీ సర్పంచ్ రామిరెడ్డి పాల్గొన్నారు.



కల్లూర్‌లో కీటక శాస్త్రవేత్త సాయి చరణ్

తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలి

వేల్పూర్: రైతులు తమ పంటల భూమిలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా కమిటీ సభ్యుడు కోటపాటి నర్సింహనాయుడు పేర్కొన్నారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్‌లో మంగళవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రుద్రూర్ కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తలు ఆకుల దినేష్, డాక్టర్ శ్రీలత, ఏవో శృతి పంటల సాగుపై అవగాహన కల్పించారు. పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి వివరించారు.

విత్తనాలు కొనుగోలు చేస్తే బిల్లు తీసుకోవాలి



మధుసూదన్, ఏవో

డొంకేశ్వర్(ఆర్మూర్): వానాకాలం సీజన్ మొదలైన నేపథ్యంలో రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్త వహించాలని, అన్ని పరిశీలించిన తర్వాతే మేలైన విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి మధుసూదన్ సూచించారు. సందేహాలు, సలహాల కోసం స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించాలని ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్సు ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన సమయంలో బిల్లు రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బిల్లులు ఇవ్వకపోతే వ్యవసాయాధికారులను సమాచారం ఇవ్వాలని చెప్పారు. మంచి దిగుబడినిచ్చే విత్తనాలను మాత్రమే ఎంచుకోవాలన్నారు.

అలరించిన సంగీత విభావరి

బోధన్: పట్టణ కేంద్రంలోని శక్కర్‌నగర్ సద్గురు శ్రీ త్యాగరాజ ఆరాధన ఉత్సవ కమిటీ సంగీత ఉపాధ్యాయురాలు సరళ నేతృత్వంలో మంగళవారం రాత్రి స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో సంగీత విభావరి నిర్వహించారు. మండల విద్యాశాఖ ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌లో సంగీతంలో తర్ఫీదు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో సంగీత విభావరి ఏర్పాటు చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన, శంఖానాద ఆలాపన, గణపతి ప్రార్థన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ రాగాలతో త్యాగరాజ, అన్నమయ్య, భక్తరాందాస్ కీర్తనలు, దేశభక్తి గేయాలను విద్యార్థులు లయబద్ధంగా ఆలాపన చేశారు. ప్రముఖ వేణు వాయిద్య విద్వాన్ కేశ్ వైద్య, త్యాగరాజ ఆరాధన ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ప్రతాపగౌరీ శంకర శాస్త్రి, ఆర్య సమాజ్ ప్రతినిధి ప్రదీప్ గుప్తా, పంపా సాహితి పీఠం ప్రధాన కార్యదర్శి పబ్బ మురళి, అశోక్ కులకర్ణి పాల్గొన్నారు.



భక్తి గేయాలు ఆలపిస్తున్న సంగీత ఉపాధ్యాయురాలు సరళ, విద్యార్థినులు

వైభవంగా చౌడేశ్వరి దేవి కల్యాణోత్సవం



రుద్రూర్: మండల కేంద్రంలో రామలింగ చౌడేశ్వరి దేవి కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా దేవాంగ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం దేవికి నూతన వస్త్రాల సమర్పణ, జెండావిష్కరణ, ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళ హరతులతో స్వాగతం పలికారు. సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

అవసరమున్న చోట కల్వర్టులు నిర్మించండి

- అపరిశుభ్రతకు చోటివ్వకండి
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): వర్షపు నీరు నిల్వ ఉండకుండా పట్టణంలోని శర్బతీ కెనాల్‌పై అవసరమున్న చోట కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని బల్దియా అధికారులకు బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని శర్బతీ కెనాల్ కాలనీ, రాకాసిపేట్, తట్టికోట్ కాలనీలో కాలువను, అనంతరం తట్టికోట్‌లో నూతనంగా నిర్మించిన కల్వర్టును పరిశీలించారు. వర్షా కాలంలో పట్టణంలో పలు చోట్ల కాలువలు పొంగిపొర్లడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని, భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య సమస్యలు రాకుండా మురికి కాలువలు శుభ్రం చేయాలని, మురికి కాలువలు లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అన్నారు. బల్దియా కమిషనర్ వెంకట నారాయణ, డీఈ యోగేష్, ఏఈ శ్రీనివాస్, జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ తదితరులున్నారు.

పార్టీ విధి విధానాలకు కట్టుబడి ఉండాలి

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్: పార్టీ విధి విధానాలకు కట్టుబడి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు సంస్థాగత నిర్మాణ ప్రక్రియను పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై బోధన్ పట్టణం, రూరల్, సాలూర మండలాల కార్యకర్తలకు వారు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017 సంవత్సరానికి ముందు నుంచి పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు, నాయకులకు గ్రామ కమిటీ అధ్యక్షులుగా నియమించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ సామాజిక వర్గాలు, యువత, మహిళలకు కమిటీల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. వారం రోజుల్లోగా గ్రామస్థాయి కమిటీల ఎన్నికలను పూర్తి చేసి నివేదిక అందించాలని నాయకులకు తెలిపారు. పార్టీ బలోపేతానికి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ,అభివృద్ధి పథకాలను ప్రస్తావిస్తూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న పేదలకు సహకరించాలని నాయకులకు సూచించారు. పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి



ఎడపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకట్

ఎడపల్లి(బోధన్): కాంగ్రెస్ కార్యకర్తలు అంకితభావంతో పనిచేసే నాయకులను గుర్తించి ఎన్నుకోవాలని జిల్లా పరిశీలకులు ఎమ్మెల్సీ బలుమూరి వెంకట్ సూచించారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఒకే పదవిలో మూడు సంవత్సరాలున్న వారిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించుకోవాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ... వారం రోజుల్లో పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తి కావాలన్నారు. పార్టీలు ఫిరాయించిన వారికి ప్రస్తుతం అవకాశాలు లేవన్నారు. ఎడపల్లి అధ్యక్షుడు పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్, నాయకులు నారాయణ చౌదరి, రజిత, మల్కా రెడ్డి, కిషోర్, తదితరలు పాల్గొన్నారు.

యువతకు ప్రాధాన్యం

నవీపేట: స్థానిక ఎన్నికలలో యువతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పేర్కొన్నారు. మంగళవారం నవీపేటలో రెంజల్, నవీపేట మండలాల కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకట్ మాట్లాడుతూ.. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని సూచించారు. పార్టీలో పని చేసే నాయకులకు అధిష్టానం పదవులు ఇస్తుందని సూచించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ..పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త అహర్నిశలు పని చేయాలన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, నవీపేట, రెంజల్ మండలాల నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మోబిన్, నాగభూషణం పాల్గొన్నారు.

మాజీ ప్రధాని నెహ్రూకు ఘన నివాళి

మాజీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని ఆర్మూర్ నియోజకవర్గంలో పలుచోట్ల మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..భారతదేశంలో వ్యవసాయరంగాన్ని ఎంతో అభివృద్ధి చేసిన ఘనత నెహ్రూదేనన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– నందిపేట/ఆర్మూర్‌టౌన్/బాల్కొండ



బాల్కొండలో ఎస్సారెస్పీ వద్ద..



నందిపేటలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



ఆర్మూర్ పట్టణం అశోక్ నగర్‌లో..

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 సింగిల్(తెలుగు)-10.45, 1.30, 7.45
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-4.15, 10.30

స్క్రీన్-4 శుభం(తెలుగు)-10.50, 7.55
ఏస్(తెలుగు)-1.30, 10.35
హిట్(తెలుగు)-4.40

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,600	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	90,095		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలి

మోర్తాడ్: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్దిదారులు నిబంధనలను పాటించాలని భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. మంగళవారం దేవన్‌పల్లి, పురాణిపేట్‌లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యదర్శి జితేందర్ ఉన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు వార్డులలో మురికి కాలువలలో పేరుకుపోయిన పూడికను తీసే పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సై గజానంద్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ పూర్ణిమా శ్రీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

ఆర్మూర్ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ నేతలు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో కార్యకర్తలతో వారు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. డివిజన్ కమిటీ సభ్యులు కూతాడి ఎల్లయ్య, కొండ గంగాధర్, ఇడగొట్టివటి సాయిలు, జక్కం సుజాత, కుల్దీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఆర్మూర్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ సూచించారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్లో మంగళవారం సామాజిక సేవకులు తులసి కుమార్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. రానున్న తరాలకు మంచి వాతావరణం ఇవ్వాలని కోరారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నందిపేట్(ఆర్మూర్): తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండు చేస్తూ మంగళవారం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో నందిపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ధాన్యం తడిసి ముద్దయిం.. మొలకలు వచ్చాయని నేతలు పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతాంగాన్ని కాపాడాలని వారు కోరారు. నాయకులు కె.గంగాధర్, ఎం.దేవన్న, రాజలింగం, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు హామీ



నవీపేట: మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన విశ్వబ్రాహ్మణ సంఘం భవనానికి రూ. 5 లక్షలు మంజూరు చేసేందుకు ఎంపీ అరవింద్ సానుకూలంగా స్పందించారని పార్టీ మండల అధ్యక్షుడు ద్యాగ సరిన్ మంగళవారం పేర్కొన్నారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులకు మంజూరు పత్రాలను అందజేశారని పేర్కొన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన బీజేపీ నేతలు ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.